క్లుప్తంగా

చంద్ర లిఫ్టు ఇరిగేషన్ కమిటీ ఏర్పాటు చేస్తాం

జిల్లా కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు చంద్రా లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అధికారులు, గ్రామాల రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉన్నత అధికారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, ఆర్డీఓ రాజకుమారి, అచ్చంపేట తహసీల్దార్ పద్మావతి. ఈఓ శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు



అచ్చంపేట: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవాలయాల్లో మహిళలు ఆటపాటలతో నిర్వహిస్తున్న బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మదేవాలయం, శ్రీసీతారామస్వామి దేవాలయం, హరిహర క్షేత్రంలోని గంగా, భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామివారి దేవాలయం తదితర దేవాలయాల వద్ద సాయంత్రం 6 గంటల నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయి. మహిళలు అమ్మ వారికి ప్రత్యేక ప్రసాదాలు నివేదిస్తున్నారు. చేయీ చేయీ కలుపుతూ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... అంటూ ఆడుతూ, పాడుతూ మహిళలు పాల్గొంటున్నారు. బతుకమ్మ తల్లి కథ చదువుకుని, బతుకమ్మ పడిన కష్టాలు ఎవ్వరికీ రాకూడదని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ ఉత్సవాలను ముగిస్తున్నారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొంటున్నారు.

క్రోసూరు ఎస్‌ఐ పాల్‌రవీందర్ బదిలీ

క్రోసూరు: క్రోసూరు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ పాల్‌రవీందర్ బదిలీ అయ్యారు. ఆ మేరకు ఉత్తర్వులు వచ్చాయని సీఐ వీరాస్వామి బుధవారం తెలిపారు. పాల్‌రవీందర్ రొంపిచర్ల మండల పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. పాల్‌రవీందర్ ఈ ఏడాది జూన్‌లో క్రోసూరు ఎస్‌ఐగా విధుల్లో చేరారు. ఇక్కడ విధుల్లో చేరిన నాలుగు మాసాలకే బదిలీపై వెళ్లారు.

పారిశుద్ధ్య కార్మికుడికి ఆర్థిక సాయం

చిలకలూరిపేట: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వమని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కత్తి బాలయేసు ఇటీవల ప్రమాదవశాత్తు చేతివేళ్లను కోల్పోయాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రఫాని, అలాగే తోటి పారిశుద్ధ్య కార్మికులు స్పందించారు. చైర్మన్ రఫాని రూ.5వేలు, కార్మికుల నుంచి వసూలైన మొత్తాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందించారు.

ప్రజలందరికీ ఆరోగ్య భాగ్యమే లక్ష్యం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పలు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



సత్తెనపల్లి పట్టణంలో మందుల కిట్‌ను అందజేస్తున్న, మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: ప్రజలకు పైసా ఖర్చు లేకుండా ఆరోగ్య భాగ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని 8వ సచివాలయ పరిధిలోని 25, 26 వార్డుల ప్రజలకు మున్సిపల్ కార్యాలయం వెనక గల కమ్యూనిటీ హాల్ నందు బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ద్వారా పేదలకు ఏమాత్రం ఖర్చు లేకుండా వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ ఇవిధంగా జరగలేదని, ప్రతి వార్డుకు వైద్యులు వచ్చి అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులకు పంపిస్తున్నారని చెప్పారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లను పంపిణీ చేశారు. వైద్యులు షేక్ మహబూబ్ అలీ, జి.ధర్మ సింగ్ శాస్త్రి, నవ్య, పాలిని లు 416 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 170 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం 26 మందిని జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఆప్తమాలజిస్ట్ డాక్టర్ అరుణకుమారి 77 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 38 మందికి కళ్లజోళ్లు పంపిణీకి ఆర్డర్ పంపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాయపాటి పురుషోత్తమరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, సిరిగిరి వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, యూపీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

రోగనిర్ధారణతో మరణాల నివారణ

రాజుపాలెం: వయసుతో సంబంధం లేకుండా గుండెపోటుతో, మెదడు జబ్బులతో చాలామంది ఆకస్మికంగా మృతి చెందుతున్నారని, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో ఇలాంటి ఆకస్మిక మరణాలను నివారిస్తాయని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర మంత్రి అంబటి మాట్లాడుతూ.. వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. శిబిరంలో వైద్యులు సుష్మ, ప్రవీణకుమార్, శ్రీనునాయక్, రవితేజనాయక్‌లు 387 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. 206 మందికి బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. 153 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, సర్పంచ్ మేరీభాయితులసీనాయక్, ఎంపీటీసీ బ్రహ్మారెడ్డి, మాజీ ఎంపీపీ వేల్పుల వెంకటేశ్వర్లు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పులిబండ్ల అశోక్, నాయకులు వేల్పుల శ్రీను, లక్ష్మయ్య, బండికల్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష అండ

అచ్చంపేట: నిరుపేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కొండంత అండగా నిలుస్తోందని జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని గ్రంధశిరి గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. రోగులకు మందుల కిట్‌లను పంపిణీ చేశారు. ఉప డీఎంహెచ్‌వో డాక్టర్ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా జీవించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన పోషక ఆహార పంపిణీని పరిశీలించారు మొత్తం 315 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 12మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ వైద్యశాలలకు రిఫర్ చేశారు. 122 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 96 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. పీహెచ్‌సీ వైద్యులు ఇన్నారావు, రాంబాబు, స్పెషలిస్ట్ వైద్యులు వై.సుజాత, ఎం.రాజేష్ వైద్యపరీక్షలు నిర్వహించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ పద్మాదేవి, జిల్లా గణాంకాధికారి నీలకతేశ్వరరావు, సర్పంచ్ రావెళ్ల శ్రీధర్, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకటరావు, సీహెచ్‌వో శివనాగేశ్వరి, హెచ్‌వీ బేబీరాణి, రామకోటమ్మ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు కిలారి విజయలక్ష్మి, నగరాజకుమారి, ఉషారాణి పాల్గొన్నారు.

422 మందికి వైద్యపరీక్షలు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు 2 సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 422 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. వైద్యశిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు కె.శ్రీనివాసరావు, ప్రవీణ్, బాలఅంకమ్మబాయి, సిరిచందన, సాద్ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ గఫూర్, గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి, సయ్యద్ అబ్దుల్ రహీం, టి.అప్పిరెడ్డి, మర్రి శ్రీనివాసరెడ్డి, సయ్యద్ సైదా, ఆవుల అంకిరెడ్డి పాల్గొన్నారు.

లేమల్లెలో వైద్యశిబిరం

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామ సచివాలయ పరిధిలో ×జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం ఎంపీపీ మేకల హనుమంతరావు, పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో రవి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చటానికి ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిదేనన్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో రవి జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం ద్వారా అందుతున్న వైద్యసేవలను గ్రామస్తులను, రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు శివరత్నకుమార్, తేజస్వి, హరిబాబు సునీల్‌లు 552 మంది రోగులను పరీక్షించి రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, మండల జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, నంబూరు బాబురావు, ఉగ్గం యలమంద, ఎంపీటీసీ నాగుల్‌మీరావలి, ఆశా వర్కర్లు, ఎఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆయుష్, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ పరిధిలోని కర్లపూడి గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రంథశిరిలో కిట్ అందజేస్తున్న, జెడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి



దొడ్లేరులో విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



లేమల్లెలో రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారులు

ఏఎంసీలో నేతల విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన



సత్తెనపల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, డైరెక్టర్లు కలిసి భూమి పూజలో పాల్గొన్నారు. వైఎస్సార్ మరణానంతరం 5వ రోజు పెండెం బాబురావు, తన మిత్ర బృందంతో పావురాల గుట్టకు వెళ్లి వైఎస్సార్ పార్థివదేహానికి సంబంధించిన దుస్తులు, అక్కడ సేకరించిన మట్టి, ప్రమాదంలో హెలికాప్టర్‌కు సంబంధించిన వస్తువులు సేకరించి ఆ వస్తువులన్నింటిని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం ముందు వైఎస్సార్ విగ్రహ శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమంలో వేశారు. అనంతరం ఇటీవల నూతన ఫర్నిచర్ కొనుగోలు, బిల్డింగ్ ఆధునికీకరణ రూ.4.50 లక్షలతో చేపట్టారు. దీనికి సంబంధించిన శిలాఫలకాన్ని చైర్మన్ పెండెం బాబురావు, డైరెక్టర్లు ఆవిష్కరించారు. పాలకవర్గ సమావేశం నిర్వహించి వివిధ తీర్మానాలను ఆమోదించారు. ఆయా కార్యక్రమా ల్లో ఉన్నత శ్రేణి కార్యదర్శి ఇస్మాయేలు, గ్రేడ్–2 సెక్రటరీ భాస్కరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శనగ విత్తనాల పంపిణీ

ముప్పాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రబీ సాగుకు అవసరమైన శనగ విత్తనాలు సబ్సిడీపై గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ బుధవారం చెప్పారు. 40 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తామన్నారు. అన్ని గ్రామాల్లోని ఆర్బీకేల్లో విత్తనాలు నిల్వలు ఉంచామని, విత్తనాలు కావాల్సిన వారు రైతు ఆధార్‌కార్డుతో పాటుగా పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ ఖాతా వివరాలతో ఆయా గ్రామ రైతుభరోసా కేంద్రంలోని వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా తీసుకోవచ్చన్నారు. ఒక్కో కేజీ పూర్తి ధర రూ.81 కాగా, సబ్సిడీ పోను రైతు రూ.49.50 చొప్పున చెల్లించాలన్నారు. ఎకరాకు 40 కేజీలు అందిస్తామని, ఎకరంలోపు ఉంటే 20 కేజీల చొప్పున ఐదు ఎకరాల వరకు విత్తనాలు ఇస్తామని చెప్పారు. సరిపడా నిల్వలున్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పంట వివరాలను ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు.

ఉపాధి హామీ పథకంలో పొరపాట్లకు తావు ఇవ్వరాదు



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న ఏపీడీ సురేంద్రకుమార్

రాజుపాలెం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పొరపాట్లకు తావు లేకుండా అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని ప్రొసిడింగ్ అధికారి సీహెచ్ సురేంద్రకుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2022–23 ఏడాదికి గాను ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీడీ సురేంద్రకుమార్ మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్‌లు జాబ్ కార్డులు సక్రమంగా పూర్తి చేయాలని సూచించారు. మచ్చర్లు తప్పులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఏడు రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. బ్రాహ్మణపల్లి, అంచులవారిపాలెం, అనుపాలెం తదితర గ్రామాలలో మచ్చర్లు తప్పులు ఉండడం వలన ఫీల్డ్ అసిస్టెంట్‌లు రికవరీ నగదు చెల్లించాలని తెలిపారు. ఏపీవో చెవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో మొత్తం 805 పనులు జరిగాయని తెలిపారు. కూలీలకు రూ.6,62,86,471, మెటీరియల్ కింద రూ.1,08,73,327 అందజేశామన్నారు. పనుల్లో పొరపాట్లతో ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రూ.19,401 రికవరీ చేయాలని తనిఖీల్లో గుర్తించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీవో ఎస్.భరత్‌కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి టి.విజయలక్ష్మి, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పొత్తూరి వెంకటనారాయణ, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీటీ వెంకటేశ్వరరావు, డీఆర్పీలు, ఇంజినీరింగ్, వెల్ఫేర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మంచినీటి చెరువులు నింపేందుకు చర్యలు

చిలకలూరిపేట: మంచినీటి చెరువులు నింపేందుకు అవసరమైన అన్నీ చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణానికి తాగు నీరు సరఫరా చేసే మంచినీటి చెరువులకు సాగర్ జలాలు చేరుతున్న నేపథ్యంలో బుధవారం మున్సిపల్ అధికారులతో కలిసి చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో సాగర్ జలాలు నింపేందుకు మోటార్లు ఏర్పాటు చేసి చెరువులోకి నీటిని తోడుతున్నట్లు వెల్లడించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైతే అదనంగా మోటార్లు, ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి చెరువులను సమృద్ధిగా నింపాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గణపవరం చెరువు పరిశీలన

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం రక్షిత మంచినీటి చెరువును బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఎస్‌పీ అధికారులు పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సురేష్, ఏఈ సూర్యతేజ ఎన్ఎస్‌పీ డీఈ శ్రీనివాసరావు, ఏఈ మురళీకృష్ణ, సచివాలయ ఇంజినీర్ సంతోష్ పరిశీలించారు.

ప్రజల చిరునవ్వే సీఎం వైఎస్ జగనన్న లక్ష్యం

- గోరంట్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అంబటి రాంబాబు



గోరంట్లలో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రజల చిరునవ్వు చూడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా సీఎం అనేక సంక్షేమ పథకాలు, ప్రజలకు మేలు జరిగే సరికొత్త పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ బాగుండాలన్నదే జగన్‌మోహన్ రెడ్డి తపన అని, దాని కోసం ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రజలకు జరుగుతున్న మంచి చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేని పోని ఆరోపణలతో ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. గతంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిన నాయకులను, పార్టీలను చూశామని, వైఎస్ఆర్ సీపీ, సీఎం జగనన్న అలా కాదని ఎన్నికలు మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రి చేయాలన్నారు.

సంక్షేమానికి పెద్ద పీట

మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ.. వచ్చే జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ అందజేయనున్నామని, ప్రజల బాగోగుల కోసం ఇంతగా తపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించు కోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలకా జైపాల్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, మర్రి సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ మండల నాయకుడు నందిగం యల్లమంద, తెల్లగట్ల కృష్ణ, సర్పంచ్ దార్ల సంధ్య, ఎంపీటీసీ గోపయ్య, నాయకులు పృథ్వీరాజ్, దావీదు, రోశయ్య, అధికారులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి నమోస్తుతే !



మహాలక్ష్మీదేవిగా వాసవీ మాత



శ్రీసనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో మహాలక్ష్మీదేవి



లంకెలకూరపాడు శివాలయంలో..



క్రోసూరులో గాయత్రీదేవీగా



త్రిశక్తి దుర్గా పీఠంలో అన్నపూర్ణాదేవి

సత్తెనపల్లి: సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం అమ్మ వార్లు అన్నపూర్ణాదేవి, మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మ వార్లను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధనలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

ముప్పాళ్ల: ముప్పాళ్లలోని శ్రీఅన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి, చాగంటివారిపాలెంలో ఏర్పాటు చేసిన మండపంలో, నార్నెపాడులోని శ్రీశంభులింగేశ్వరస్వామి ఆలయం, లంకెలకూరపాడులోని శ్రీగంగా పార్వతి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయం, మాదలలోని శ్రీసంగమేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మ వార్లు ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు.

గాయత్రీదేవీగా వాసవీ మాత

క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు బుధవారం గాయత్రీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బతుకమ్మ ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు భక్తిపాటలతో అమ్మవారిని కీర్తించారు.



వెంకటపతికాలనీలో అన్నపూర్ణాదేవిగా..



కొత్తపేటలో అన్నపూర్ణాదేవి



బెల్లంకొండలో ధనలక్ష్మీదేవిగా



పెద్దమక్కెనలో వారాహిదేవి

భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

బెల్లంకొండలో వేడుకలు

బెల్లంకొండ: మండల కేంద్రంలోని మహాలక్ష్మి పీఠంలో బుధవారం అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నాగిరెడ్డిపాలెం గ్రామంలో శ్రీ దుర్గామాత ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మహేశ్వరీదేవిగా దర్శనం

నకరికల్లు: చేజర్ల గ్రామంలో శ్రీకపోతేశ్వరస్వామి ఆలయంలో శ్రీమహేశ్వరీదేవిగా, నర్సింగపాడులోని శ్రీఅన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానాల్లో అమ్మ వార్లను శ్రీమహాకాళీగా అలంకరించారు.



కొత్తపేటలో 108 రకాల నైవేద్యాలతో భక్తుల పూజలు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతుకు శనగలు అందజేస్తున్న ఎంపీపీ మారూరి పద్మ, ఏవో అరుణ

ముప్పాళ్ల: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మారూరి పద్మ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ మారూరి పద్మ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతుభరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్‌జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైందన్నారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా భూముల రీసర్వే ప్రక్రియ చేపట్టారన్నారు. రీ సర్వే ప్రక్రియకు రైతులు సహకరించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు కోరారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అందించే శనగలను ఎంపీపీ చేతుల మీదుగా రైతులకు అందించారు. సమావేశంలో ఎంపీడీవో పీ పుట్టారెడ్డి, ఎంఈవో ఒంగోలు రాజు, ఏవో ఎం.అరుణ, కో ఆప్షన్ సభ్యుడు అజ్గర్‌వలి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.